నమస్తే తెలంగాణ
# రంగారెడ్డి
I | హైదరాబాద్, శనివారం 16 నవంబర్ 2024 | RANGAREDDY



విద్యార్థినికి బహుమతిని అందిస్తున్న వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

## గిరిజనుల జీవన ప్రమాణాలను మెరుగుపర్చాలి

అందుకు వారికి ప్రభుత్వ పథకాలను అందించాలి

వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, నవంబర్ 15 : గిరిజనుల జీవన ప్రమాణాలను మెరుగుపర్చేందుకు, వారికి ప్రభుత్వ పథకాలను అందించాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ లోని మీటింగ్ హాల్‌లో ధరతి ఆబ భగవాన్ బిర్సా ముండా జయంతిని పురస్కరించుకుని గిరిజన దినోత్సవ సమరోహం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకలో భాగంగా ప్రధాని మోదీ దేశంలోని 100 జిల్లాల గిరిజనులను ఉద్దేశించి మాట్లాడిన సందేశాన్ని దృశ్యమాలిక ద్వారా అధికారులు, గిరిజనులు తిలకించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ ప్రతీక్ జైన్ జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ.. గిరిజనులకు మెరుగైన వసతులు కల్పించడమే ధరతి ఆబ జన జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ పథకం ప్రధాన ఉద్దేశమన్నారు. ఈ స్కీం కింద జిల్లాలో మొదటి విడతలో ఎంపికైన 31 ఆవాసాల్లో మౌలిక వసతుల కల్పనకు అధికారులు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు గిరిజన వస్త్రధారణలో చేసిన ప్రదర్శన ఎంతో ఆకట్టుకున్న ది. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ జిల్లా అధికారి కమలాకర్ రెడ్డి, ప్రత్యేక అధికారిణి ఫణికుమారి, డీఎంహెచ్‌వో వెంకటరమణ, ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సంక్షేమ శాఖ అధికారులు, వివిధ గ్రామాల గిరిజనులు పాల్గొన్నారు.

## నరేందర్‌రెడ్డిని బేషరతుగా రిలీజ్ చేయాలి

రైతులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలి

తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు డిమాండ్



విలేకరులతో మాట్లాడుతుతున్న శ్రీనివాస్, వెంకటేశ్వర్లు

కొడంగల్, నవంబర్ 15 : దుద్యాల మండలంలోని లగచర్ల గ్రామంలో జరిగిన ఘటనలో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డితోపాటు రైతులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేసి, వారిని బేషరతుగా విడుదల చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఫార్మా విలేజ్ ఏర్పాటుకు భూములను ఇచ్చేది లేదని రైతులు స్పష్టం చేసినా ప్రభుత్వం పదేపదే ప్రజాభిప్రాయ సేకరణతో ఇబ్బందులకు గురి చేయడం తగదన్నారు. ఫార్మా విలేజ్ భూసేకరణలో భాగంగా ప్రజాభిప్రాయ సేకరణ కోసం లగచర్లకు వెళ్లిన అధికారులపై తమ భూములను కోల్పోవాల్సి వస్తుందేమోనన్న బాధ, భయంతోనే రైతులు దాడి చేశారన్నారు. దేశానికి అన్నం పెట్టే రైతులను జైల్లో పెట్టడం సరైంది కాదన్నారు.

## రూ.300 కోట్లు వసూలు.. 3600 మందికి కుచ్చుటోపీ

ఆపై బోర్డు తిప్పేసిన 12 వెల్త్ క్యాపిటల్ సర్వీసెస్

రంగంలోకి దిగిన సైబరాబాద్ ఈవోడబ్ల్యూ పోలీసులు

8మంది ఘరానా మోసగాళ్లు అరెస్ట్



సిటీబ్యూరో, నవంబర్ 15 (నమస్తే తెలంగాణ): తమ కంపెనీలో పెట్టుబడులు పెట్టి ప్లాట్లు కొనుగోలు చేస్తే ప్రతి నెలా 4శాతం లాభాలు చెల్లిస్తామంటూ కొందరిని, డబుల్ గోల్డ్ స్కీమ్ కింద పెట్టుబడులు పెడితే తక్కువ కాలంలోనే పెట్టుబడికి రెట్టింపు చెల్లిస్తామంటూ 3600మంది నుంచి సుమారు రూ.300 కోట్లు వసూలు చేసి బోర్డు తిప్పేసిన 8మంది ఘరానా మోసగాళ్లను సైబరాబాద్ ఈఓడబ్ల్యూ పోలీసులు అరెస్టు చేశారు. ఈఓడబ్ల్యూ డీసీపీ కె.ప్రసాద్ కథనం ప్రకారం...కలిదిండి పవన్‌కుమార్ 12 వెల్త్ క్యాపిటల్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు మేనేజింగ్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నాడు. ఇతడికి రావుల సత్యనారాయణ, హరికృష్ణ, వల్లూరు భాస్కర్‌రెడ్డి, పగడాల రవికుమార్ రెడ్డి, కొల్లటి జ్యోతి, కురల్ల మౌనిక, కుర్కుల లావణ్య అనుచరులుగా వ్యవహరిస్తున్నారు. ఇదిలా ఉండగా తమ కంపెనీలో కనీసం రెండు గుంటల స్థలాన్ని రూ.8.08లక్షల పెట్టుబడిగా పెట్టి కొనుగోలు చేస్తే వారికి 25 నెలల పాటు ప్రతి నెలా 4శాతం చొప్పున రూ.32వేలు చెల్లిస్తామని జోరుగా ప్రచారం చేశారు. అంతే కాకుండా ఈ స్కీమ్‌లో చేర్పించిన వారికి 1శాతం చొప్పున 25నెలల పాటు ప్రతి నెలా రూ.7200 చొప్పున చెల్లిస్తామని నమ్మించారు. అదే విధంగా డబుల్ గోల్డ్ స్కీమ్‌లో కనీసం రూ.4లక్షలు పెట్టుబడిగా పెడితే వారికి బాండ్ ఇవ్వడంతో పాటు 12నెలల తరువాత పెట్టిన పెట్టుబడికి రెట్టింపు అంటే రూ.8లక్షల విలువ చేసే స్విట్జర్లాండ్ గోల్డ్ బిస్కెట్స్‌ను అందజేస్తామని నమ్మించారు. గోల్డ్ చిట్ స్కీమ్ పేరుతో మరో వల వేసి రూ.5లక్షలను 20నెలల పాటు పెట్టుబడిగా పెడితే పెట్టిన పెట్టుబడిపై 19నెలల పాటు 3శాతం అంటే రూ.15వేల చొప్పున ప్రతి నెలా చెల్లిస్తామని, 20వ నెల మరో రూ.15వేలు అదనంగా చెల్లిస్తామని ఈ క్రమంలో మొత్తం రూ.8లక్షలు చెల్లిస్తామని నమ్మించారు. ఈ విధంగా మొత్తం 3600 మంది నుంచి సుమారు రూ.300 కోట్లు వసూలు చేసి బోర్డు తిప్పేశారు. దీంతో మోసపోయినట్లు గ్రహించిన బాధితుడు కేపీహెచ్‌బీ ప్రాంతానికి చెందిన నాయని హరికంత పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న ఈఓడబ్ల్యూ పోలీసులు దర్యాప్తు జరిపి 12వెల్త్ క్యాపిటల్ సర్వీసెస్ ప్రై.లి.ఎండీ కలిదిండి పవన్‌కుమార్ సహా మొత్తం 8మంది నిందితులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

## పరిగి డీఎస్పీ కార్యాలయానికి మరో డీఎస్పీ అటాచ్

లగచర్ల కేసు విచారణ వేగవంతానికి పోలీసు ఉన్నతాధికారుల నిర్ణయం



శ్రీనివాస్, డీఎస్పీ

పరిగి, నవంబర్ 15 : ఇటీవల దుద్యాల మండలంలోని లగచర్లలో వికారాబాద్ కలెక్టర్, అధికారులపై దాడి ఘటనకు సంబంధించిన కేసు విచారణను మరింత వేగవంతం చేయాలని పోలీసు ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఈ మేరకు పరిగి డీఎస్పీ కార్యాలయానికి మరో డీఎస్పీ శ్రీనివాస్‌ను అటాచ్ చేశారు. శ్రీనివాస్ ఇటీవలి వరకు పరిగి సీఐగా పనిచేయడంతోపాటు ఈ ప్రాంతంపై పూర్తిస్థాయిలో అవగాహన ఉన్నది. డీజీపీ కార్యాలయంలో వెయిటింగ్‌లో ఉన్న డీఎస్పీ శ్రీనివాస్‌ను అదనంగా పరిగి డీఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేశారు.



# సమస్యలు యథాతథం.. భూమాత అయోమయం

జిల్లాలో రెవెన్యూ దరఖాస్తుల పరిష్కారం ప్రహసనంగా మారింది. అడుగడుగునా అవంతరాలు ఏర్పడుతుండడంతో దరఖాస్తుదారులు పనుల కోసం కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మరోవైపు రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం భూమాత పథకాన్ని తీసుకొస్తామని ప్రకటించగా.. 11 నెలలు గడిచినా ఆ పథకం అందుబాటులోకి రాకపోవడంతో అర్జీదారులు తీవ్ర ఇబ్బ ందులు పడుతున్నారు. అధికారులు సమస్యలు పరిష్కరించేందుకు అవకాశం ఉన్నా భూ మాత స్కీం వస్తుందని.. ఆ పథకం వచ్చిన తర్వాతే చర్యలు తీసుకుంటామని కార్యాలయాలకు వచ్చిన దరఖాస్తులను వెనక్కి తిప్పి పంపిస్తున్నారు.

*- రంగారెడ్డి, నవంబర్ 15 (నమస్తే తెలంగాణ)*

ఇంకా అందుబాటులోకి రాని భూమాత పథకం..

పరిష్కారం కాని రెవెన్యూ సమస్యలు

కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న అర్జీదారులు

భూమాత రాగానే పరిష్కరిస్తామంటున్న అధికారులు

ఇబ్బ ందుల్లో దరఖాస్తుదారులు

రంగారెడ్డి జిల్లాలో 16,499 పైగానే దరఖాస్తులు పెండింగ్‌లో..

రంగారెడ్డి జిల్లాలో 16,499 పైగా రెవెన్యూ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిలో కలెక్టర్, అదనపు కలెక్టర్ లాగిన్లలో 7,655 దరఖాస్తులు, ఆర్డీవోలు, తహసీల్దార్ల లాగిన్లలో 8,844 పెండింగ్‌లో ఉన్నాయి. 7,655 దరఖాస్తుల పరిష్కా రానికి కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కానీ అవి పరిష్కారం అవుతాయా..? లేదా ..? అనేది ప్రశ్నార్థకంగా మారింది. అధికారులు చిన్న, చిన్న సమస్యలున్నా పరిష్కరించడం లేదని అర్జీదారులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా టీఎం-33 కింద దరఖాస్తు చేసుకున్న వాటికి గత మూడేండ్లుగా మోక్షం లభించడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### తరచూ కలెక్టర్లు మారడమే కారణమా..?

రెవెన్యూ సమస్యలు పరిష్కారానికి నోచుకోకపోవడానికి తరచూ కలెక్టర్ల బదిలీలే కారణమనే ఆరోపణలున్నాయి. గత పది నెలల్లో ముగ్గురు కలెక్టర్లు బదిలీ అయ్యారు. కొత్తగా వచ్చిన వారు ఆ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకునే లోపే మళ్లీ వేరే ప్రాంతానికి వెళ్లిపోయారు. కలెక్టర్లు మారినప్పుడల్లా రెవెన్యూ సమస్యలు పెరిగి పోవడం సర్వసాధారణమైంది. అలాగే, అదనపు కలెక్టర్ ఏసీబీ అధికారులకు చిక్కిన నేపథ్యంలో ఆ సమస్యలు మళ్లీ మూలనపడ్డాయి. దీంతో కొత్తగా వచ్చిన కలెక్టర్ నారాయణరెడ్డి పైనే బాధితులు ఆశలు పెట్టుకున్నారు. కొత్త కలెక్టర్ తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

### 11 నెలలు దాటినా అందుబాటులోకి రాని పథకం..

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి తాము అధికారంలోకి రాగానే భూమాతను తీసుకొస్తామని అసెంబ్లీ ఎన్నికల సమయంలో చెప్పిన నాయకులు.. 11 నెలలు దాటినా ఇప్పటి వరకూ భూమాతను తీసుకురాలేదు. అసలు భూమాత వస్తుందా.. లేదా.. అనేది రైతుల్లో అయోమయం నెలకొన్నది. భూమాత వస్తుందని అధికారులు రెవెన్యూ సమస్యలపై దృష్టి పెట్టడంలేదనే ఆరోపణలున్నాయి. భూమాత పథకం వచ్చిన తర్వాతే ఆ సమస్యలను పరిష్కరిస్తామని కార్యాలయాలకు వచ్చిన అర్జీదారులను అధికారులు వెనక్కి పంపిస్తున్నట్లు సమాచారం.

### భూమాత ఊసే లేదు..



నేను టీఎం-33 కింద దరఖాస్తు చేశా. మూడేండ్లుగా కార్యాలయాల చుట్టూ తిరిగినా సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదు. ఇటీవల తన దరఖాస్తు తహసీల్దార్ నుంచి ఆర్డీవోకు.. ఆర్డీవో నుంచి కలెక్టర్‌కు వెళ్లింది. కలెక్టర్ అప్రూవల్ చేయగా ప్రస్తుతం సీసీఎల్ఏలో నిలిచిపోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం భూమాత పథకాన్ని తీసుకొస్తామని చెప్పి .. దాని ఊసే ఎత్తడం లేదు. రెవెన్యూ సమస్యలపై రేవంత్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు.

– ఇందిరాల రమేశ్, కౌన్సిలర్, ఇబ్రహీంపట్నం



## ఇంటింటికీ వెళ్లండి.. ఓటీఎస్‌పై అవగాహన పెంచండి

సమావేశంలో జల మండలి ఎండీ

సిటీబ్యూరో, నవంబర్ 15 (నమస్తే తెలంగాణ): జల మండలి అమలుచేస్తున్న వన్‌టైం సెటిల్‌మెంట్ (ఓటీఎస్)పై ఎండీ అశోక్ రెడ్డి, ఈడీ మయాంక్ మిట్టల్‌లు డైరెక్టర్లు, సీజీఎం, జీఎంలతో జూమ్ మీటింగ్ సమీక్షాసమావేశం నిర్వహించారు. ఓటీఎస్ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకునేలా విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ప్రతి డివిజన్‌లోనూ టాప్-10 వినియోగదారులు, ప్రభుత్వ కార్యాలయాలు అధిక మొత్తంలో బిల్లులు వసూలు చేయాలని జీఎంలకు ఎండీ సూచించారు. ప్రతి మేనేజర్ ఇంటింటికీ వెళ్లి ఓటీఎస్‌పై ప్రజల్లో అవగాహన కల్పించి జల మండలి రెగ్యులర్ మీటర్ రీడర్లు, కలెక్షన్ గ్యాంగ్‌లతో కలిసి బిల్లులు వసూలు అయ్యేలా చూడాలన్నారు. న్యాయపరమైన దీర్ఘకాలికంగా బిల్లు చెల్లించకుండా ఉన్న వినియోగదారులను గుర్తించి వారి సమస్యను పరిష్కరించడానికి సీజీఎంలు చొరవ తీసుకోవాలని ఈడీ మయాంక్ మిట్టల్ పేర్కొన్నారు. సమావేశంలో జల మండలి ఈఎన్సీ, రెవెన్యూ డైరెక్టర్ వీఎల్ ప్రవీణ్ కుమార్, ఆపరేషన్ డైరెక్టర్ -2 స్వామి, సీజీఎం, జీఎంలు పాల్గొన్నారు.

## మూసీ ప్రక్షాళనతో కాంగ్రెస్ పార్టీ భారీ స్కామ్

బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి

మన్సూరాబాద్, నవంబర్ 15: మూసీ ప్రక్షాళన పేరుతో కాంగ్రెస్ పార్టీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భారీ స్కామ్‌కు తెరలేపారని బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి ఆరోపించారు. ఎల్బీనగర్, చంద్రపురి కాలనీలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మూసీ సుందరీకరణ పేరుతో పేదల ఇండ్లను కూల్చేందుకు కాంగ్రెస్ పార్టీ చేస్తున్న కుట్రలను తిప్పి కొడతామన్నారు. మూసీ సుందరీకరణ కోసం ఎలాంటి డీపీఆర్ సిద్ధం చేయకుండానే రూ.లక్షయాభై వేల కోట్ల నిధులు అవసరమవుతాయని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. పేద ప్రజల ఇండ్లను కూల్చి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నాడన్నారు. ప్రజలకు మద్దతుగా శనివారం రాత్రి మూసీ పరీవాహక ప్రాంతాల్లోని 27 చోట్ల బీజేపీకి చెందిన కేంద్ర మంత్రులు, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలు, ఎమ్మెల్యేలు బస చేస్తారన్నారు. తెలంగాణ ప్రజల సొమ్మును కొల్లగొట్టి ఇతర రాష్ట్రాల్లో జరుగుతున్న ఎన్నికల కోసం కాంగ్రెస్ అధిష్ఠానానికి డబ్బు మూటలు పంపేందుకే ముఖ్యమంత్రి మూసీ ప్రక్షాళన అంశాన్ని ముందుకు తీసుకువచ్చారన్నారు. మూసీ పరీవాహక ప్రాంతాల ప్రజలకు బీజేపీ మద్దతుగా నిలిచి కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెబుతామన్నారు.



మంచాల మండలంలోని బుగ్గరామలింగేశ్వర స్వామి ఆలయంలో కిటకిటలాడుతున్న భక్తులు

# కార్తికం..దేదీప్యం

ఉమ్మడి జిల్లాలో భక్తులతో కిటకిటలాడిన దేవాలయాలు

శివకేశవులకు ప్రీతిపాత్రమైన పవిత్ర కార్తిక పౌర్ణమి సందర్భ ంగా శుక్రవారం ఉమ్మడి రంగారెడ్డి జిల్లావ్యాప్తంగా పలు ఆలయాలు కిటకిటలాడాయి. వేకువ జాము నుంచే మహిళా భక్తులు కార్తిక స్నానమాచరించిన అనంతరం ఎంతో భక్తిశ్రద్ధలతో దీపాలను వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. సర్వపాపాలు తొలగి, అష్టైశ్వర్యాలు కలుగాలని తమ ఇష్ట దైవాలను వేడుకున్నారు.



కులకచర్ల మండల పరిధిలోని బండవెల్కిచర్ల పాంబండ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో కార్తిక దీపారాధనలో పాల్గొన్న భక్తులు